జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ
డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
వీక్షించండి
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.
ఎడిటర్: చౌదరి, 9963063761

శుక్రవారం | 25-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 792 పేజీలు: 4 వెల : రూ.7



- 630 హెక్టార్లలో ఉద్యానవన పంటలకు నష్టం
- నేలకూలిన 152 విద్యుత్ స్తంభాలు
- పాక్షింగా కూలిన 83 ఇళ్లు
- జలదిగ్బంధంలో రహదారులు
- ముంపులోనే వేలాది ఎకరాల పంటలు
- 86 పునరావాస కేంద్రాల్లో 221 మంది ఆశ్రయం
- ఉప్పొంగుతున్న నదులు, గెడ్డలు
- రెండు చెరువులకు గండి
- ఏ మేరకు నష్టం జరిగింది పరిశీలిస్తున్న సంబంధిత అధికారులు

# అర్నాబ్‌తో.. అతలాకుతలం













శ్రీకాకుళం, సెప్టెంబర్ 24 (వార్త): అర్నాబ్ తుఫాన్ జిల్లా ప్రజలను అతలాకుతలం చేసింది. బుధవారం రాత్రి కళింగపట్నం వద్ద తీర దాటిన సమయంలో వీచిన గాలులకు పెద్ద ఎత్తున చెట్లు, విద్యుత్ స్తంభాలకు నష్టం కలిగించింది. పాక్షికంగా 83 ఇళ్లు కూలిపోగా, వేలాది ఎకరాల పంటలు నీట మునిగాయి. వంశధార, నాగావళి నదులతో పాటు గెడ్డలు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. రెండు చెరువులకు గండి పడింది. పలు రహదారులు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. పోలీసు, రెవెన్యూ, విద్యుత్, తదితర శాఖలు అప్రమత్తంగా ఉండి విపత్కర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంటున్నాయని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తుపాను కళింగపట్నం వద్ద బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తీరం దాటిందని, ప్రస్తుతం జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టాయని వెల్లడించారు. జిల్లాలో ఈ నెల 22న 42 మి.మీ, 23న 87.3 మి.మీ, 24న 98.99 మి.మీ చొప్పున సగటు వర్షపాతం నమోదైందని వివరించారు. పొరుగు రాష్ట్రమైన ఒడిశాలోని గంజాం, గజపతి జిల్లాలతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నాగావళి, వంశధార నదులకు భారీగా వరద నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ముందుజాగ్రత్తగా జిల్లా వ్యాప్తంగా 86 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రస్తుతం అందులో 221 మంది ఆశ్రయం పొందుతున్నారని తెలిపారు. భారీ వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా 83 ఇళ్లు దెబ్బతిన్నాయని, 152 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని కలెక్టర్ తెలిపారు. చెట్లు కూలిపోయిన ప్రాంతాల్లో నాలుగు గంటల్లోనే రోడ్లను క్లియర్ చేసి రాకపోకలను పునరుద్ధరించినట్లు చెప్పారు. అంపోలులోని 33 కేవీ సబ్‌స్టేషన్‌ను పునరుద్ధరించడానికి 8 గంటల సమయం పట్టిందని, ప్రస్తుతం 11 కేవీ లైన్లు పనిచేస్తున్నాయని, జిల్లాలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. ఈ నెలలో ప్రసవ తేదీలు ఉన్న 42 మంది గర్భిణులను ముందుగానే గుర్తించి ఆసుపత్రుల్లో చేర్పించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం బహుదా నదిలోకి 23,000 క్యూసెక్కుల నీరు వస్తోందని, అక్కడి సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. నాగావళికి 25,000 క్యూసెక్కుల నీరు రాబోతోందని.. ప్రమాద హెచ్చరిక స్థాయి 45,000 క్యూసెక్కులు అయినప్పటికీ ముందుగానే యంత్రాంగాన్ని సిద్ధం చేశామన్నారు. జిల్లాలో రెండు చెరువులకు గండి పడినప్పటికీ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగలేదన్నారు. సహాయక చర్యల కోసం రెండు ఎస్‌డీఆర్‌ఎఫ్, ఒక ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్నాయని, అకస్మాత్తుగా వచ్చే వరదలు పట్ల అత్యంత అప్రమత్తంగా ఉన్నామని చెప్పారు. శుక్రవారం సాయంత్రం వరకు ఈ ఈదురు గాలుల తీవ్రత కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నిరంతరం పనిచేస్తుందన్నారు. పాఠశాలల పరిసరాలు, అక్కడికి వెళ్లే రహదారులు సురక్షితంగా ఉంటేనే శుక్రవారం పాఠశాలలను పునఃప్రారంభించాలని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించారని, అధికారులంతా సమర్థంగా విధులు నిర్వహించారని కొనియాడారు. తుపాను ప్రభావంతో ఇప్పటివరకు 630 హెక్టార్లలో ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన నష్టాలను అధికారులు క్షేత్ర స్థాయిలో అంచనా వేస్తున్నారని చెప్పారు. వంశధార ఇంజనీరింగ్ అధికారుల సమర్థవంతమైన కృషి వల్ల ఫ్లడ్ ఫ్లో కెనాల్, క్యాచ్‌మెంట్ ద్వారా హీరమండలం రిజర్వాయర్‌లో 1 టీఎంసీ నీటిని నిల్వ చేయగలిగామన్నారు. వర్షాలు పడ్డాయని మళ్లీ వరి పైరు జోలికి వెళ్లకుండా, రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

## నష్టంపై నివేదిక ఇవ్వండి: మంత్రి అచ్చెన్న

టెక్కలి నియోజకవర్గంలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విస్తృత పర్యటన చేశారు. టెక్కలి మండలం పరిధిలోని మెళియాపుట్టి రహదారిని, తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రహదారులను స్వయంగా పరిశీలించారు. రహదారుల పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, రహదారులు, భవనాల శాఖల అధికారులతో పరిస్థితిపై సమీక్షించి, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. పాడైన రహదారులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు, కొత్త రహదారుల ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లోని అన్ని గ్రామాలకు నూతన రహదారులు వేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని రహదారులు, పంచాయతీరాజ్, ఐటీడీఏ అధికారులకు సూచించారు. నందిగాం మండలం కొత్త అగ్రహారం వద్ద తుఫాన్ ప్రభావంతో కూలిపోయిన వంతెనను మంత్రి పరిశీలించారు. వంతెన పునర్నిర్మాణానికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.









జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఏఎంసీ సెస్సు సమస్య పరిష్కారంపై ఆశలు

**-విజయవాడలో మంత్రి అచ్చెన్నాయుడుతో ఏపీ సీఎంఏ ప్రతినిధుల భేటీ**

**-జీడి పరిశ్రమ సమస్యలను వివరించిన వైనం**

**- త్వరలో సానుకూల నిర్ణయమన్న ఆశాభావం**



**పలాస, సెప్టెంబరు 24 (వార్త):** జీడి పరిశ్రమను కొంతకాలంగా ఇబ్బందులకు గురిచేస్తున్న ఏఎంసీ (అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ) సెస్సు సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయని ఏపీసీఎంఏ (ఏపీ సీఎంఏ) ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు విజయవాడలో గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును, సంబంధిత శాఖ డైరెక్టర్ శ్రీనివాస్, జేడీని ఒకే వేదికపై కలిసి పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను సమగ్రంగా వివరించినట్లు తెలిపారు. జీడి ముడిసరుకు కొనుగోళ్లు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ తదితర అంశాలపై ఏఎంసీ సెస్సు భారం పరిశ్రమపై పడుతున్న తీరును మంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సెస్సు సమస్యకు ఆచరణాత్మక పరిష్కారం చూపితే జీడి పరిశ్రమకు ఊరట లభించడంతో పాటు ఉత్పత్తిదారులు, వ్యాపారులు, కార్మికులు తదితర వర్గాలకు ప్రయోజనం కలుగుతుందని వివరించినట్లు వెల్లడించారు. సమావేశంలో తమ సమక్షంలోనే డైరెక్టర్ శ్రీనివాస్, ఓఎస్డీ పోలినాయుడు కూడా జీడి పరిశ్రమ ప్రతినిధులు చేస్తున్న డిమాండ్లను మంత్రి అచ్చెన్నాయుడికి స్పష్టంగా వివరించారని తెలిపారు. సమస్య తీవ్రత, పరిశ్రమపై దాని ప్రభావాన్ని అధికారులకు వివరించడంతో ప్రస్తుతం పరిస్థితులు సానుకూలంగా మారాయని, త్వరలోనే ప్రభుత్వం నుంచి పరిష్కార మార్గం లభించే అవకాశం ఉందన్న నమ్మకం కలిగిందని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ సీఎంఏ అధ్యక్షుడు ఫణి రాఘవులు, ఉపాధ్యక్షుడు మల్లా కాంతారావు, తుని మ్యానుఫ్యాక్చరర్స్‌కు చెందిన వాసు, దూబచర్లకు చెందిన ఉదయ్, పలాసకు చెందిన సిందిరి కిషోర్, డోకి శంకర్రావు తదితరులు పాల్గొని సమస్య పరిష్కారానికి తమ వంతు సహకారం అందించారని తెలిపారు. జీడి పరిశ్రమకు కీలకంగా మారిన ఏఎంసీ సెస్సు అంశంపై ఏపీ సీఎంఏ నిరంతరం ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ పరిష్కారం కోసం కృషి చేస్తోందని పారిశ్రామికవాడ ప్రతినిధులు పేర్కొన్నారు. పరిశ్రమ ఎదుర్కొంటున్న ఈ జటిలమైన సమస్య నుంచి జీడి ఉత్పత్తిదారులు, పరిశ్రమ వర్గాలకు ఉపశమనం కల్పించేందుకు ఏపీ సీఎంఏ చేస్తున్న ప్రయత్నాలను అభినందిస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామికవాడ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు, కార్యదర్శి తూముల శ్రీను, కోశాధికారి కొంచాడా వినయ్‌తో పాటు సభ్యులు ఏపీ సీఎంఏ ప్రతినిధులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వం, అధికారులు సానుకూలంగా స్పందిస్తున్న నేపథ్యంలో ఏఎంసీ సెస్సు సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## తుపాను ప్రాంతాల్లో టీడీపీ నేతల పర్యటన



**మందస, సెప్టెంబరు 24(వార్త):** అర్నాబ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ప్రభావితమైన పలు పంచాయతీల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు పర్యటించారు. మందస మండలంలో బుడంబో, సాబకోట, చీపి, నర్సింగపురం తదితర గ్రామ పంచాయతీలను సందర్శించి స్థానిక పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, కార్యకర్తలతో సమావేశమై తుపాను పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల తీవ్రతకు దెబ్బతిన్న ఇళ్లను స్వయంగా పరిశీలించి బాధితులకు ధైర్యం చెప్పారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ఉన్న డ్యామ్‌లు, చెరువుల నీటి మట్టాన్ని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన మాట్లాడుతూ తుపాను వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కార్యకర్తలు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధనతో పాటు సీనియర్ నాయకులు రట్టి లింగరాజు, ముంజేటి చంద్రశేఖర్, నవీన్ యాదవ్, ఔగాన ఈశ్వరరావు, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బూరగాంలో కూలిపోయిన ఇళ్లు



**కంచిలి, సెప్టెంబరు 24 (వార్త):** బూరగాం గ్రామంలో ప్రస్తుత భారీ వర్షాలకు మూడు ఇళ్లు కూలిపోయాయి. సమాచారం తెలిసిన వెంటనే గురువారం ఉదయం మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు బూరగాం గ్రామానికి చేరుకొని బాధితులను కలిశారు. నేలమట్టమైన ఇండ్లను పరిశీలించారు. హౌసింగ్ అధికారులతో ఆయన ఫోన్లో మాట్లాడి బూరగాం గ్రామాన్ని వెంటనే పరిశీలించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులతో మాట్లాడి తప్పకుండా కొత్త ఇండ్లు బాధితులకు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. మాజీ సర్పంచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై కూలిన చెట్టు



**కొత్తూరు, సెప్టెంబరు 24 (వార్త):** వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురుగాలులకు మండల పరిధిలోని వసప గ్రామం వద్ద ఆంధ్రప్రదేశ్--ఒడిశా ప్రధాన రహదారిపై ఓ భారీ చెట్టు నేలకొరిగింది. రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలిపోవడంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. గ్రామస్థులు పోలీసు వారికి సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించిన కొత్తూరు ఎస్సై వెంకటేష్, అగ్నిమాపక అధికారి బుచ్చోడు తమ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎలాంటి ప్రమాదాలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్తగా వాహనాలను సురక్షిత ప్రాంతాల్లో నిలిపివేశారు. అనంతరం ఫైర్ సిబ్బంది, పోలీసులు సంయుక్తంగా ఆధునిక యంత్రాలతో భారీ కొమ్మలను నరికి, రహదారిపై ఉన్న చెట్టు మొద్దులను యుద్ధప్రాతిపదికన తొలగించారు. రోడ్డు పూర్తిగా క్లియర్ కావడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారమై వాహనాల రాకపోకలు యథావిధిగా పునరుద్ధరించబడ్డాయి. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేష్ మాట్లాడుతూ.. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీస్తున్నందున వాహనదారులు, ప్రయాణికులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదం జరిగిన కొద్దిసేపట్లోనే స్పందించి రాకపోకలను పునరుద్ధరించిన పోలీసు, అగ్నిమాపక సిబ్బందిని స్థానిక గ్రామస్థులు, ప్రయాణికులు ప్రత్యేకంగా అభినందించారు.

## దసరా నవరాత్రులకు శుభరాట

**సోంపేట, సెప్టెంబరు 24(వార్త):** సోంపేటలోని శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఆలయం వద్ద దసరా నవరాత్రులకు గురువారం శ్రీ విజయ దుర్గ మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో శుభరాట వేశారు. మంచి ముహూర్తం నేపథ్యంలో ముందస్తుగా పూజా కార్యక్రమాలు నడుమ భక్తిశ్రద్ధలతో శుభరాట కార్యక్రమం నిర్వహించారు. దసరా నవరాత్రులను అక్టోబర్ 11 నుంచి 20 తేది వరకు నిర్వహించనున్నట్లు మోటార్ యూనియన్ అసోసియేషన్ ప్రతినిధి పిట్ట హేమరావు తెలిపారు. ప్రతి ఏటా విజయ దుర్గ ఆలయం వద్ద వైభవంగా శరన్నవరాత్రులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది కూడా ఘనంగా చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## వరహాల గెడ్డపై కాజ్‌వే పునర్నిర్మించాలి

**-వరదల సమయంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు - గతంలో గిరిజనుడి మృతి**

**- రైతులను ఆదుకోవాలి - పాత రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలి**

**- సీపీఐ నాయకుడు సుందర్‌లాల్**



**పలాస, సెప్టెంబరు 24 (వార్త):** భారీ వర్షాలతో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో పలాస మండలం కంబిరిగాం వద్ద వరహాల గెడ్డపై ఉన్న కాజ్‌వేను తక్షణమే పునర్నిర్మించాలని సీపీఐ నాయకుడు చాపర సుందర్‌లాల్ డిమాండ్ చేశారు. గురువారం పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఆర్నబ్ వాయుగుండం ప్రభావంతో జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వంశధార, నాగావళి, బాహుదా నదులతో పాటు నారాయణపురం కాలువలో వరద ప్రవాహం పెరిగిందని సుందర్‌లాల్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద పరిస్థితులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. వరహాల గెడ్డపై ఉన్న కాజ్‌వే వరదల సమయంలో ముంపునకు గురవుతుండటంతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సుందర్‌లాల్ ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దంచల, చిన్నంచల, గోదావరి, కేదారిపురం, ఈదురాపల్లి తదితర గ్రామాల ప్రజలు పనులు, వ్యాపారాలు, ఇతర అవసరాల కోసం పలాస-కాశీబుగ్గ పట్టణాలకు ఈ మార్గం మీదుగానే రాకపోకలు సాగిస్తారని తెలిపారు. వరదనీరు పెరిగిన ప్రతిసారీ ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుండటంతో ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. గతంలో తుఫాన్ సమయంలో వరహాల గెడ్డలో పడి ఓ గిరిజనుడు మృతి చెందిన ఘటనను ఆయన గుర్తుచేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కాజ్‌వేను ఆధునిక ప్రమాణాలతో పునర్నిర్మించి, వరదనీరు సాఫీగా వెళ్లేలా శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ఒకవైపు అతివృష్టి, మరోవైపు అనావృష్టి పరిస్థితులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సుందర్‌లాల్ తెలిపారు. పంట నష్టాలను సమగ్రంగా అంచనా వేసి బాధిత రైతులకు తక్షణ పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో బ్యాంకుల ద్వారా రైతులు పొందిన రుణాలను మాఫీ చేసి, తదుపరి సాగుకు అవసరమైన కొత్త రుణాలను సకాలంలో మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను అంచనా వేయాలని, అవసరమైన చోట సహాయక చర్యలు చేపట్టాలని సుందర్‌లాల్ కోరారు.

## కంబిరిగాం కాజ్‌వేను పరిశీలించిన వజ్జ బాబూరావు



**పలాస, సెప్టెంబరు 24 (వార్త):** అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో పలాస మండలంలో కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని,కంబిరిగాం గ్రామ సమీపంలోని వరహాల గెడ్డ పొంగిపొర్లుతుండటంతో కాజ్‌వేపై రాకపోకల విషయంలో అప్రమత్తత అవసరమని ఏపీటీపీసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. గురువారం కంబిరిగాం కాజ్‌వేను ఆయన పరిశీలించి, గెడ్డలో నీటి ప్రవాహ ఉధృతిని, అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు కాజ్‌వే వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఆయన.. వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల రాకపోకలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కాజ్‌వే వద్ద విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ, పోలీసు సిబ్బందితో మాట్లాడి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. వరహాల గెడ్డలో నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాబూరావు సూచించారు. కాజ్‌వేపై వరదనీరు ప్రవహిస్తున్న సమయంలో దానిని దాటేందుకు ఎవరూ ప్రయత్నించవద్దని, అత్యుత్సాహానికి వెళ్లి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రయాణాలను పరిమితం చేసుకోవాలని, పిల్లలు, వృద్ధులు కాజ్‌వే పరిసరాలకు వెళ్లకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు, ఇతర సంబంధిత శాఖల సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని బాబూరావు అన్నారు. కాజ్‌వే వద్ద నీటి మట్టం, ప్రవాహ ఉధృతిని నిరంతరం గమనిస్తూ అవసరమైన సమయంలో రాకపోకలను నియంత్రించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గే వరకు అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉంటే అవాంఛనీయ ఘటనలను నివారించవచ్చని అన్నారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసి తగిన నిర్ణయాలు తీసుకోవాలని వజ్జ బాబూరావు తెలిపారు.

## యువత సేవా కార్యక్రమాలకు అండగా ఉంటా

**- బుర్లే శ్రీనివాసరావు**

**- మెట్టూరు మహసేన యూత్‌కు రూ.25,000 విరాళం అందజేత**

**కొత్తూరు, సెప్టెంబరు 24 (వార్త):** సమాజ హితం కోసం పాటుపడే యువతకు జనసేన పార్టీ ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా



నిలుస్తుందని కొత్తూరు మండల జనసేన పార్టీ నాయకులు బుర్లే శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మెట్టూరు గ్రామంలో శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో 'మెట్టూరు మహసేన యూత్' నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ చేపడుతున్న సామాజిక, ధార్మిక కార్యక్రమాలకు మద్దతుగా తన వంతుగా రూ. 25,000 నగదు విరాళాన్ని యువత ప్రతినిధులకు స్వయంగా అందజేశారు. అనంతరం బుర్లే శ్రీనివాసరావు మాట్లాడుతూ, గ్రామాల్లోని యువత కేవలం పండుగలకే పరిమితం కాకుండా సేవా కార్యక్రమాలు, గ్రామాభివృద్ధిలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. యువశక్తిని సరైన మార్గంలో నడిపించినప్పుడే సమాజంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. సేవా దృక్పథంతో ముందుకు వచ్చి రూ. 25,000 ఆర్థిక సాయం అందించిన జనసేన నాయకుడు బుర్లే శ్రీనివాసరావుకు మహసేన యూత్ సభ్యులు, కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులను వినాయక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెట్టూరు మహసేన యూత్ సభ్యులు, స్థానిక జనసేన పార్టీ శ్రేణులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గొట్టాబ్యారేజ్ నీటి ఉధృతిని పరిశీలించిన ఎంజీఆర్

**-వంశధార నదిలో నీటి ప్రవాహం, క్యూసెక్కుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే గోవిందరావు**

**- వరద పరిస్థితులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం**

**హిరమండలం/ ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 24(వార్త):** అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు కారణంగా వంశధార నదిలో పెరుగుతున్న నీటి ఉధృతిని పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు పరిశీలించారు. ఈ సందర్భంగా అయినా వంశధార శాఖ అధికారులతో చర్చించారు. నీటి ప్రవాహం, ప్రస్తుతం బ్యారేజ్ వద్ద కొనసాగుతున్న క్యూసెక్కుల వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో వంశధార నదిలో నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులు పర్యవేక్షించాలన్నారు .గొట్టా బ్యారేజ్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

ఈయనతో పాటు ఎన్డీఏ కూటమి నాయకులు, వంశధార శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సేవా తత్పరుడి శాశ్వత వీడ్కోలు

**-డాక్టర్ కొండల జగన్నాథం మృతి.. పలాసలో విషాదం**



**పలాస, సెప్టెంబరు 24 (వార్త):** పలాసకు చెందిన ప్రముఖ వైద్యుడు, సేవాభావి డాక్టర్ కొండల జగన్నాథం గురువారం కన్నుమూశారు. ఆయన మృతి పలాస ప్రాంతంలో విషాదాన్ని నింపింది. వైద్య వృత్తిలో రోగులకు సేవలందించడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకైన పాత్ర పోషించిన జగన్నాథం పలువురి అభిమానాన్ని చూరగొన్నారు. పలాస లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా, జిల్లా చైర్మన్‌గా, జోన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. సేవా కార్యక్రమాలు, సామాజిక బాధ్యతల్లో చురుకైన భాగస్వామ్యం కనబరిచినందుకు పలు పురస్కారాలను అందుకున్నారు. వైద్య సేవలతోపాటు సమాజ సేవకు ప్రాధాన్యం ఇస్తూ తనదైన ముద్ర వేశారు. మందస మండలం మఖరజోల ఆయన స్వస్థలం. ఆయనకు భార్య ప్రభావతి, కుమారులు మధుబాబు, రవిబాబు, కుమార్తె శ్రీలత ఉన్నారు. ఆయన పెద్ద కుమారుడు కొండల మధుబాబు ప్రముఖ మధుర చరిత్రకారుడిగా, సీనియర్ జర్నలిస్టుగా, జూనియర్ కాలేజ్ అధ్యాపకునిగా పలాస ప్రాంతంలో సుపరిచితులు. డాక్టర్ జగన్నాథం మృతి పట్ల పలాసకు చెందిన వైద్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు, వివిధ రంగాల ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైద్యుడిగా, సేవా కార్యకర్తగా జగన్నాథం అందించిన సేవలను పలువురు స్మరించుకున్నారు.

## తుఫాన్ వేళ అప్రమత్తతే ఆయుధం

**-అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలి**

**- ప్రజల రక్షణకు ప్రాధాన్యం**

**-ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వహించాలి: డా. రవికృష్ణ మట్టా**

**పలాస, సెప్టెంబరు 24 (వార్త):** ఆర్నాబ్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని శ్రీకాకుళం ఆత్మ ప్రాజెక్టు డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ డా. రవికృష్ణ మట్టా సూచించారు. తుఫాన్ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండాలని, ప్రజల రక్షణే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. తుఫాన్ సమయంలో క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు అధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని ఆయన స్పష్టం చేశారు. వర్షాలు, వరదలు, ఇతర విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తుఫాన్ వంటి విపత్తు పరిస్థితుల్లో ప్రభుత్వ ఉద్యోగులు మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందన ఆలస్యం కాకుండా సమన్వయంతో పనిచేయాలని, విధుల్లో ఎటువంటి అలసత్వానికి తావివ్వకుండా చూడాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు సంబంధించిన ప్రతి అంశాన్ని ప్రాధాన్యంగా తీసుకుని క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండటం, ప్రజలకు అందుబాటులో ఉండటం కీలకమని ఆయన వెల్లడించారు. పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకునేలా సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలాస ఎంపీడీవో వసంత కుమార్, డిప్యూటీ ఎంపీడీవో వైకుంఠరావు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**- ఎమ్మెల్యే గౌతు శిరీషకు**

## ఏపీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ వినతి



**పలాస, సెప్టెంబరు 24 (వార్త):** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో సేవలందిస్తున్న మూడు లక్షలకు పైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చొరవ చూపాలని ఏపీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ దూసి భానుజీరావు కోరారు. ఈ మేరకు గురువారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భానుజీరావు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో కీలకమైన సేవలు అందిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం స్పష్టమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి, న్యాయం జరిగేలా సహకరించాలని ఎమ్మెల్యే గౌతు శిరీషను కోరినట్లు తెలిపారు. తమ సమస్యలను ఎమ్మెల్యే శిరీష సానుకూలంగా విన్నారని, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చినట్లు భానుజీరావు తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నిర్వహించే చర్చల్లో ఏపీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీని భాగస్వామ్యం చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, పీఆర్‌సీలో ఆయా కేటగిరీలను పరిగణనలోకి తీసుకుని సీనియార్టీ ఆధారంగా వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ వర్తింపజేయడంతో పాటు కనీస వేతనాల స్థాయికి అనుగుణంగా మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. ఉద్యోగులందరికీ ఆరోగ్య పథకం సదుపాయం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు అందుతున్న కొన్ని ప్రాథమిక సంక్షేమ సదుపాయాలను ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా వర్తింపజేయాలని అన్నారు. ప్రత్యేకంగా వైద్య విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి సంవత్సరానికి 35 సెలవు దినాలు మంజూరు చేయాలని, పురుష ఉద్యోగులకు పెటర్నిటీ సెలవులు కల్పించాలని కోరారు. ఖాళీల ఆధారంగా ఉద్యోగుల సొంత ప్రాంతాలకు బదిలీ అయ్యే అవకాశం కల్పించాలని, మెడికల్ లీవ్‌ను కచ్చితంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఓహెచ్‌ఎస్ సదుపాయం కల్పించాలని, ఉద్యోగుల వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలని కోరారు. పదవీ విరమణ అనంతరం ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా కనీసం రూ.20 లక్షల ఆర్థిక భద్రత కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భానుజీరావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీవనోపాధితో ముడిపడి ఉన్న ఈ అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ముంపు ప్రాంతాల్లో ఆర్డీవో అప్పలరాజు పర్యటన



**పలాస, సెప్టెంబరు 24 (వార్త):** తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముంపు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.అప్పలరాజు సూచించారు. గురువారం పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో పర్యటించిన ఆయన ముంపు ప్రాంతాలు, గెడ్డలు, కాలువలు, రహదారులను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితులపై క్షేత్రస్థాయిలో సమీక్షించి, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పలాస మండలం శాసనం గ్రామంతో పాటు కంబిరిగాం గ్రామంలోని వరాహల గెడ్డ, గొట్ట బ్యారేజ్ లెఫ్ట్ మెయిన్ కెనాల్ ప్రాంతాలను ఆర్డీవో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో నీటి ప్రవాహం, ముంపు పరిస్థితులను స్వయంగా పరిశీలించి, పరిస్థితి మరింత తీవ్రతరం కాకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గెడ్డలు, కాలువలు, రహదారుల వద్ద నీటి ఉధృతి పెరిగిన సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి గ్రామంలో తుఫాన్ ప్రభావంతో ఏర్పడిన పరిస్థితులను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైన చోట ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే రాకపోకలను నియంత్రించి, ప్రజల ప్రాణ భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. తుఫాన్ సమయంలో వర్షపాతం, నీటి ప్రవాహాల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీవో ఆర్.అప్పలరాజు ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తక్షణమే స్పందించేలా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ పర్యటనలో పలాస డీటీ గిరిరాజు, ఎంఆర్ఐ, వజ్రపుకొత్తూరు తహసీల్దార్ సీతారామయ్య, డీటీ శ్రవణ్‌కుమార్, ఎంఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు



**నరసన్నపేట, సెప్టెంబరు 24 (వార్త):** భారీ వర్షాలు, పెనుగాలుల కారణంగా నరసన్నపేట మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్. మహేంద్రనాథ్ తెలిపారు. గురువారం మండలంలో విద్యుత్ పునరుద్ధరణ పనులను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, దెబ్బతిన్న వైర్లను సిబ్బంది మరమ్మతు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. మండలంలోని అన్ని గ్రామాలకు గురువారం సాయంత్రానికే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారని మహేంద్రనాథ్ వివరించారు. మరమ్మతు పనులు చేపడుతున్న కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యుత్ లైన్ల వద్ద అప్రమత్తంగా వ్యవహరించాలని పలు సూచనలు చేశారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని ఆదేశించారు.

## ముంపులో 500 ఎకరాల సుసరాం తంపర భూములు

**-పోలాకి-పిన్నింటిపేట రహదారిపై మెకాళ్ల లోతు నీరు**

**- మూడు రోజుల వర్షాలతో రాకపోకలకు తీవ్ర అంతరాయం**

**- ఏటా ముంపుతో నష్టపోతున్నామని రైతుల ఆవేదన**

**పోలాకి, సెప్టెంబరు 24 (వార్త):** సుసరాం గ్రామం వద్ద ప్రధాన రహదారిపై వరద నీరు ప్రవహించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలాకి నుంచి పిన్నింటిపేట వెళ్లే ప్రధాన రహదారిపై గురువారం ఉదయం నాటికి మెకాళ్ల లోతు వరకు వరద నీరు నిలిచింది. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, ఇతర వాహనాల ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నీటి ప్రవాహం పెరగడంతో రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారిందని స్థానికులు తెలిపారు. మరోవైపు వర్షాల కారణంగా తంపర భూముల్లో సుమారు 500 ఎకరాలు ఇంకా నీటిలోనే ఉన్నట్లు రైతులు పేర్కొన్నారు. పొలాల్లో నీరు ఎక్కువ కాలం నిలిచిపోవడంతో పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా వర్షాకాలంలో తంపర భూములు ముంపునకు గురవుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రహదారిపై వరద నీరు నిలిచిపోకుండా, తంపర భూముల్లో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.



### కంబిరిగాం-బ్రాహ్మణతర్ల వంతెనలకు ..

# శాశ్వత పరిష్కారమేదీ?

**- ఏటా వరద నీటితో ఇబ్బందులు**

**- అత్యవసర వేళల్లో తప్పని అవస్థలు**

**- ఎత్తైన హై-లెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రజల డిమాండ్**





**పలాస, సెప్టెంబరు 24 (వార్త):** పలాస నియోజకవర్గంలోని కంబిరిగాం, బ్రాహ్మణతర్ల ప్రాంతాల్లో వంతెనల సమస్య ఏళ్లుగా కొనసాగుతున్నా శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదని పలాస నియోజకవర్గానికి చెందిన ప్రముఖ న్యాయవాది, పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్(బాబా) ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలం వచ్చిందంటే వరద నీరు వంతెనలపై ప్రవహించడం, రెండు మూడు రోజులపాటు రాకపోకలు నిలిచిపోవడం ఆనవాయితీగా మారిందన్నారు. కంబిరిగాం మార్గం కేవలం ఒక గ్రామానికి మాత్రమే పరిమితమైన రహదారి కాదని తెలిపారు. కంబిరిగాం, కేదారిపురం, ఈదురాపల్లి, గంగువాడ, చినంచల, కొండూరు, గోదావరి, పెదంచలతో పాటు ఒడిశా వైపు అనుసంధానమయ్యే పలు గ్రామాల ప్రజలు ఈ మార్గంపై ఆధారపడుతున్నారని వెల్లడించారు. వర్షాల సమయంలో వంతెనపై వరద ఉధృతి పెరగడంతో ఈ గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. అదేవిధంగా బ్రాహ్మణతర్ల మార్గం కూడా పూర్ణభద్ర, నీలిభద్ర, బంటుకొత్తూరు, కేసుపురం, నారాయణపురం, టెక్కలి పట్నం, మెలియాపుట్టి తదితర ప్రాంతాలకు కీలకమైన అనుసంధాన మార్గమని తెలిపారు. ఈ ప్రాంతాల్లో వంతెనల పరిస్థితి కారణంగా వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వంతెనలపై వరద నీరు ప్రవహించే సమయంలో వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా అనారోగ్యంతో ఉన్నవారిని ఆసుపత్రులకు తరలించాల్సిన అత్యవసర పరిస్థితుల్లో రహదారి మార్గం అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగించే అంశమన్నారు. ప్రతి ఏటా వర్షాలు వచ్చినప్పుడు వంతెనలపై నీరు ప్రవహించడం, రాకపోకలు నిలిచిపోవడం, పరిస్థితిపై చర్చ జరగడం.. నీరు తగ్గిన తర్వాత సమస్య మళ్లీ మరుగున పడటం జరుగుతోందని తెలిపారు. తాత్కాలిక చర్యలతో సమస్యను వాయిదా వేయడం కాకుండా శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పాత సిమెంట్ పైపుల కాజ్‌వేల స్థానంలో వరద ఉధృతిని తట్టుకునేలా ఎత్తైన హై-లెవల్ బ్రిడ్జిలను నిర్మించాలని శ్రీధర్(బాబా) కోరారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, వంతెనల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. వంతెనల నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో రాకపోకల అంతరాయం తగ్గడంతో పాటు అనేక గ్రామాలకు ఏడాది పొడవునా సురక్షితమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను తరలించుకోవడం, విద్యార్థులు విద్యాసంస్థలకు వెళ్లడం, ఉద్యోగులు విధులకు హాజరుకావడం సులభతరం అవుతుందన్నారు. ప్రజల భద్రత, రాకపోకల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని కంబిరిగాం--బ్రాహ్మణతర్ల వంతెనలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ఆయన కోరారు. ఈ సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రజల తరఫున విన్నపం కొనసాగిస్తామని తెలిపారు.

## ఎర్ర చెరువు అక్రమ నిర్మాణాలను తొలగించాలి



**పాతపట్నం, సెప్టెంబరు 24 (వార్త):** స్థానికులు మానస సరోవరంగా భావించే పాతపట్నంలోని సర్వే నంబర్ 16/1 లో గల 5.08 ఎకరాల విస్తీర్ణమున్న 'ఎర్ర చెరువు' ఆక్రమణలపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరిపి, అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బి నారాయణమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన ఎర్ర చెరువు ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించి ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారులు, ఆక్రమణదారులు కుమ్మక్కై చట్టాలకు, న్యాయస్థానాల తీర్పులకు విరుద్ధంగా అనుమతులు పొంది చెరువు ఉనికిని, పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నారని ఆయన ఆరోపించారు. గతంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ జరిపి నోటీసులు జారీ చేసినప్పటికీ, ఆ తర్వాత ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆక్రమణదారులు యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపట్టారని మండిపడ్డారు. ఇటీవల చెరువులో నీరు నిల్వ ఉన్న ప్రాంతంలోనే ఇతర ప్రాంతాల నుండి మట్టిని తెచ్చి రోడ్డు నిర్మించడమే కాకుండా, విద్యుత్ సౌకర్యం కూడా కల్పించడం వెనుక ఆక్రమణదారులకు సహకరించే కుట్ర ఉందని నారాయణమూర్తి పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల చెరువు నిండిపోగా, ఆ రహదారి నిర్మాణం జరగకపోతే ఆక్రమణలన్నీ నీటమునిగి ఉండేవని, చెరువులో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తక్షణమే నేలమట్టం చేసి, పర్యావరణ విధ్వంసానికి, ఆక్రమణలకు సహకరించిన అధికారులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఐదేళ్ల ప్రయాణం.. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

**-అవకాశమిచ్చిన నాయకత్వానికి జీవితాంతం రుణపడి ఉంటా..**

**-నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మీడియా, ప్రజల సహకారం మరువలేను**

**-మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు**

**-పలాస ఎంపీపీ ఉంగ ప్రవీణ**



**పలాస, సెప్టెంబరు 24 (వార్త):** పలాస మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఐదేళ్లపాటు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన నాయకత్వానికి, తన పదవీకాలంలో అడుగడుగునా అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు, ప్రజలు, శ్రేయోభిలాషులందరికీ పలాస ఎంపీపీ ఉంగ ప్రవీణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పలాస ఎంపీపీగా తనకు లభించిన బాధ్యతను కేవలం పదవిగా కాకుండా ప్రజలకు సేవ చేసే అరుదైన అవకాశంగా భావించాన న్నారు. ఐదేళ్ల కాలంలో మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో తనవంతు కృషి చేశానని తెలిపారు. తనపై నమ్మకంతో పలాస మండల పరిషత్ అధ్యక్షురాలిగా అవకాశం కల్పించిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు జీవితాంతం కృతజ్ఞతగా ఉంటానని ఉంగ ప్రవీణ తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహించేందుకు ఆయన అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఎంతో ఉపయోగపడిందన్నారు. నాపై నమ్మకంతో ఎంపీపీగా అవకాశం కల్పించిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నానని, తన రాజకీయ, ప్రజా జీవితంలో ఈ అవకాశం ఎప్పటికీ గుర్తుండిపోయే బాధ్యతగా నిలిచిపోతుందని అన్నారు. మండల పరిషత్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో తనతో కలిసి పనిచేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల సహకారం మరువలేనిదని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అందించిన సహకారంతోనే ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయగలిగామని తెలిపారు. అధికార యంత్రాంగంతో సమన్వయంతో పనిచేస్తూ మండలంలో చేపట్టిన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకు రావడంతో పాటు మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కీలక పాత్ర పోషించారని ఉంగ ప్రవీణ అన్నారు. తన పదవీకాలంలో సహకరించిన జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## హరిజన గోపాలపురంలో వినాయక ఉత్సవాలకు రూ.10 వేల విరాళం



**పాతపట్నం, సెప్టెంబరు 24 (వార్త):** పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని హరిజన గోపాలపురం గ్రామంలో నిర్వహించిన వినాయక మండపానికి పాతపట్నం టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు పైల బాబ్జి, సైలాడ సతీష్ లు రూ. 10 వేలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలను ప్రజలందరూ సుఖసంతోషాలతో, భక్తిభావంతో జరుపుకోవాలని, దేవుని దయతో గ్రామంలో అందరూ ఐక్యంగా ఉంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ నీలమణి దుర్గా ఆలయ కమిటీ చైర్మన్ అక్కంధ్ర సన్యాసిరావు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రైతు సమస్యలపై సోషల్ మీడియా దృష్టి పెట్టాలి



**సోంపేట, సెప్టెంబరు 24 (వార్త):** రైతులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యపై సోషల్ మీడియా దృష్టి సారించి సమస్యలను ప్రభుత్వం వద్దకు చేరేలా వెంటనే కృషి చేయాలని ఎం జె పూలే రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు బీన ఢిల్లీ రావు విజ్ఞప్తి చేశారు. బీసీ సంఘం ప్రతినిధి ఎర్ర గిరిబాబుతో కలిసి బారువా సమీపంలో నీట మునిగిన వరి పంటను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బారువ, పలాసపురం, జింకిభద్ర, బుషికుద్ద, గొల్లగండి తదితర పంచాయతీల పరిధిలో సుమారు 1000 ఎకరాలు వరి పంట ముంపుకు గురైందని పేర్కొన్నారు. ఇప్పటికే మూడు రోజులు పంట నీటిలో ఉండడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతాంగానికి ఆర్నాబ్ తుఫాను ఘోరంగా దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సమస్య పట్ల సోషల్ మీడియా యాక్టివిస్టులు ప్రభుత్వానికి విషయం తెలిసేలా కృషి చేయాలని పేర్కొన్నారు. తద్వారా రైతాంగానికి కొంతైనా మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వ్యవసాయాధికారులతో కలిసి పర్యటించిన జనసేన నాయకులు



**మందస, సెప్టెంబరు 24(వార్త):** ఆర్నబ్ తుపానుతో పడుతున్న వర్షాలకు మందస మండలంలోని కళింగదళ్ రిజర్వాయర్ కు వరద నీరు చేరుతోంది. కళింగదళ్ కుడి, ఎడమ ఆయకట్టు ప్రాంతాలను, మహేంద్రతనయ ప్రవాహాన్ని వ్యవసాయ అధికారులతో జనసేన నాయకులు కలిసి పర్యటించారు. రైతులకు సమీపంలో ఉన్న గ్రామస్తులకు పలు సూచనలు, జాగ్రత్తలు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరక్టర్ శారద, వ్యవసాయాధికారి జి.నాగరాజు, జనసేన మండల అధ్యక్షుడు కుప్పయి గోపాలరావు, జిల్లా కార్యదర్శి మజ్జి భాస్కరరావు, కళింగదళ్ ఎడమ నీటి కాలువ సంఘం అధ్యక్షుడు బేసి ఈశ్వరరావు, జనసేన మండల ఉపాధ్యక్షుడు పందిరి నీలయ్య, పీఏసీఎస్ డైరక్టర్ పిన్నిశెటి వాసు, భోగాపురం జనసేన నాయకుడు బొబ్బది అప్పారావు , పొత్తంగి పంచాయితీ జనసేన నాయకుడు గేదల రమణ, బుడారిసిగీ పంచాయితీ జనసేన నాయకుడు గాస్య శివ తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో ఇరిగేషన్ అధికారులు, టీడీపీ నాయకుల పర్యటన

**మందస, సెప్టెంబరు 23(వార్త):** అర్నబ్ తుఫాన్ కారణంగా మందస మండలంలో పలు గ్రామాల్లో ఇరిగేషన్ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పర్యటించారు. పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీషమ్మ ఆదేశాల మేరకు జలవనరుల శాఖ ఏఈ ఎస్.వి.శ్రీనివాసరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ చీపిగడ్డ, బెల్లుపట్టియ, సొండిపూడి, మహేంద్రతనయ, కొత్తపల్లి తదితర గ్రామాల చెరువులు, కాలువలు పరిశీలించారు. కార్యక్రమంలో సునాముది సిస్టం-7 చైర్మన్ రట్టి లింగరాజు, మిస్క గణపతిరావు, ఔగాన ఈశ్వరరావు, అల్లుమల నారాయణరావు, యానాది వాసు, మద్ది సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## హరిపురంలో హోటళ్లలో చేరిన వరదనీరు

**-ఇబ్బందులు పడుతున్న నిర్వాహకులు**



**మందస, సెప్టెంబరు 24(వార్త):** అర్నబ్ తుపాను స్వయం ఉపాధితో జీవనం సాగిస్తున్న కొందరికి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. మందస మండలంలోని హరిపురం గ్రామంలో హోటళ్లపై ఆధారపడి బతుకుతున్న నిరుద్యోగులకు నష్టాలను మిగిల్చింది. కొంతమంది నిర్వాకంతో హోటళ్లలలో నీరు చేరడంతో హోటళ్లు మూత పడ్డాయి. హరిపురంలో రట్టి రోడ్డు జంక్షన్ లో పలు భోజన హోటళ్లు, దాబాలు ఉన్నాయి. వీటి పరిసర ప్రాంతాల్లో కొంతమంది రాజకీయ నాయకులు మట్టి వేశారు. దీంతో భారీ వర్షాలకు వరద నీరు నిలిచిపోయి, హోటళ్లలోకి ప్రవేశించింది. నీరు బయటలకు తోస్తున్నప్పటికీ, మళ్లీ ప్రవేశిస్తుండడంతో హోటళ్ల యజమానులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇందు పరివార్ హోటల్ లోకి నీరు చేరడంతో హోటల్ మూసి వేసే పరిస్థితి ఏర్పడిందని యజమాని అడ్డి రాజు(ఇందుపరివార్ రాజు) ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది కావాలనే తమకు ఇబ్బంది చేయడానికి మట్టి వేయడంతో ఈ పరిస్థితి నెలకొందని ఆరోపించారు. అధికారులు కూడా తమను కన్నెత్తి చూడడంలేదన్నారు. ఇటువంటి పరిస్థితులు అధికారులు స్పందించాలని ఆయన కోరారు.

## ఆదివారం వరకు అంచనా వేయలేం

**- పంట ముంపు పై వ్యవసాయ శాఖ**



**సోంపేట, సెప్టెంబరు 24 (వార్త):** సోంపేట మండలంలో వరద ముంపునకు గురైన ప్రాంతాలను రెండవ రోజైన గురువారం మండల వ్యవసాయ అధికారి బొర్ర నరసింహమూర్తి పలువురు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ మేరకు బారువా, బారువాపేట, పలాసపురం, లక్కవరం, జింకిభద్ర, గొల్లగండి బుషికుద్ద ప్రాంతాలలో వరి నాట్లు ఇంకా వరద నీటిలోనే మునిగి ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటికే రెండు రోజులు పూర్తిగా నీటి మునిగి ఉన్నాయని ఏవో పేర్కొన్నారు. రానున్న ఆదివారం వరకు పరిశీలించి పంట విషయంలో ఒక నిర్ణయానికి రావడం జరుగుతుందని తెలిపారు. దీనిపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని అన్నారు. బాగా దుబ్బు కట్టిన వరి అయితే 72 నుంచి 96 గంటల వరకు నీటి ముంపులో ఉన్నప్పటికీ అంత సమస్య ఉండదని పేర్కొన్నారు. పొలాల్లో వరద నీటిని బయటకు మళ్లించేందుకు రైతులు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద పూర్తిగా తగ్గిన తర్వాత పంటకు వాడాల్సిన ఎరువుల బూస్టర్ డోస్ గూర్చి రైతులకు వివరించారు.

## పుచ్చపాడులో

## రూ.40వేలు పలికిన వినాయక లడ్డు

**మందస, సెప్టెంబరు 24(వార్త):** పుచ్చపాడు గ్రామంలో వినాయక నవరాత్రులు ఘనంగా ముగిశాయి. విగ్రహాన్ని తమ్మినేని సంతోష్ కుమార్, సరోజ దంపతులు అందజేశారు. మందస మండలంలోని పితాతొళ్లి పంచాయతీలో గల పుచ్చపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ ఆర్గనైజర్ అంపోలు కిరణ్ కుమార్ లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ ప్రసాదాన్ని అంపోలు ఈశ్వరరావు, సుజాత దంపతులు అందించారు. లడ్డూను వంజరపు నాగేష్, హేమలత దంపతులు రూ.40,000లుకు దక్కించుకున్నారు. శ్రీచక్ర పెరుమాళ్ భక్తి రంజని, ఐకాన్ ఈవెంట్ కార్యక్రమాలు నిర్వహించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిమజ్జనం సాగిందని కమిటీ ఆర్గనైజర్ అంపోలు కిరణ్ కుమార్, మట్ట గణేష్, కమిటీ సభ్యులు వి.కార్తీక్, సిద్దు, కేశవ రావు, టి.సంతోష్, మహేష్, సురేష్ తెలిపారు.



# వరద ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే మామిడి

**- మోదుగువలస కాలనీ, కోవిలాంలో వరద నీటిలోనే ముంపు పరిస్థితి పరిశీలన**

**- పునరావాస కేంద్రాల్లో బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ : ఎమ్మెల్యే ఎంజీఆర్**



**ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 24(వార్త):** మోదుగువలస, కోవిలాం గ్రామాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు పరిశీలించారు. గ్రామంలో వరద నీటి పరిస్థితిని, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న బాధితులను పరామర్శించి,వారికి నిత్యావసర సరుకులు అందజేశారు.బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైన సహాయక చర్యలు అందేలా చేస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆయినా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రామయ్యవలస పాఠశాలలోకి వర్షపు నీరు

**- భారీ వర్షాలతో పాఠశాల ప్రాంగణం, తరగతి గదుల్లోకి చేరిన నీరు**

**- విద్యార్థులకు ఇబ్బందులు తప్పవని హెచ్ఎం ఆందోళన**

**- నీటిని మళ్లించేందుకు చర్యలు**



**జలుమూరు, సెప్టెంబరు 24 (వార్త):** రామయ్యవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భారీ వర్షాలకు నీటమునిగింది. బుధవారం నుంచి కురుస్తున్న వర్షాలతో పాఠశాల ప్రాంగణంలో పెద్దఎత్తున నీరు చేరడంతో పాటు తరగతి గదుల్లోకి కూడా వర్షపు నీరు ప్రవేశించినట్లు హెచ్ఎం వాన స్వాతి తెలిపారు. పాఠశాల ఆవరణలో నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. పాఠశాల యథావిధిగా కొనసాగితే విద్యార్థులు తరగతులకు హాజరయ్యే సమయంలో ఇబ్బందులు పడే అవకాశం ఉందని హెచ్ఎం పేర్కొన్నారు. వర్షపు నీరు పాఠశాల ప్రాంగణంలోకి చేరకుండా మళ్లించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పాఠశాలలో నెలకొన్న పరిస్థితిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పాఠశాల పరిసరాల్లో నీటి నిల్వను తొలగించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.



## నీట మునిగిన పొలాల పరిశీలన

**- కుద్దాం, మామిడివలస, సుందరాపురంలో పంట నష్టాలపై ఆరా**

**- పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపేందుకు చర్యలు**

**- రైతులు అధైర్యపడవద్దని భరోసా ఇచ్చిన వ్యవసాయ శాఖ అధికారులు**

**నరసన్నపేట, సెప్టెంబరు 24 (వార్త):** నరసన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను వ్యవసాయ శాఖ అధికారిణి సూర్యకుమారి గురువారం పరిశీలించారు. కుద్దాం, మామిడివలస, సుందరాపురం గ్రామాల్లో సిబ్బందితో కలిసి పర్యటించి, నీటిలో ఉన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులను కలిసి పంటల పరిస్థితి, నీటి నిల్వల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులు, సంభవించిన నష్టం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పొలాల్లో ఎక్కువగా నీరు నిలిచిపోవడం వల్ల పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున, నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారిణి పేర్కొన్నారు. పంటలకు సంబంధించి ఏవైనా సమస్యలు, నష్టాలు ఉంటే వెంటనే వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు అధైర్యపడవద్దని, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు.

## 262 ఎకరాల్లో వరి పంటకు నష్టం

**-మండల వ్యవసాయ అధికారి సింహాచలం**

**పాతపట్నం, సెప్టెంబరు 24 (వార్త) :** తుఫాన్ కారణంగా కురిసిన వర్షాల వల్ల పాతపట్నం మండలంలో విస్తారంగా పంట నష్టం వాటిల్లే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి కె సింహాచలం తెలిపారు. ప్రాథమిక అంచనాల ప్రకారం మండలంలోని 14 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న 382 మంది రైతులకు చెందిన సుమారు 262 ఎకరాల్లో వరి పంట దెబ్బతినే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల సిబ్బంది అందరూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతులకు నిరంతరం తగిన సూచనలు, సలహాలు అందించాలని ఆదేశించారు. వర్షాల వల్ల పొలాల గట్లు తెగిపోవడం లేదా పంట నీటమునిగిన చోట తక్షణమే స్పందించి రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం అందించాలని స్పష్టం చేశారు. ఏ ఒక్క రైతుకు నష్టం జరగకుండా, ప్రతీ ఒక్కరికీ వ్యవసాయ శాఖ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.



## టెక్కలి సంఘటన హృదయ విదారకరం

**-సంఘటనపై ప్రభుత్వం లోతుగా దర్యాప్తు చేయాలి -హాస్టళ్లలో భద్రతా చర్యలు పటిష్టం చేయాలి -మరణించిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి -వైసీపీ ఎస్టీ విభాగ పలాస అధ్యక్షుడు సవర నీలకంఠం**



**మందస, సెప్టెంబరు 24(వార్త):** టెక్కలి ప్రాంతంలో జరిగిన రైలు ప్రమాదంలో నలుగురు గిరిజన విద్యార్థులు మృతి చెందిన ఘటన యావత్ సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని వైసీపీ ఎస్టీ విభాగం పలాస నియోజకవర్గం అధ్యక్షుడు సవర నీలకంఠం(బిట్టుబాబు) ఆవేదన వ్యక్తం చేశారు. మందసలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుపేద గిరిజన కుటుంబాలకు చెందిన విద్యార్థులు మృత్యువాత పడటం అత్యంత బాధాకరమని అన్నారు. విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరు కోవాలని కలలు కన్న ఆ విద్యార్థుల తల్లిదండ్రులు నేడు శోకసము ద్రంలో మునిగిపోయారని పేర్కొన్నారు. హాస్టల్లో ఉంటూ చదు వుకుంటున్న విద్యార్థులు అర్ధరాత్రి సమయంలో బయటకు రావా ల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడింది? ఈవిషయంలో హాస్టల్ వార్డెన్, సిబ్బంది బాధ్యత ఏ మేరకు ఉంది? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. జరిగిన ఘటనపై ఆరోపణలు చేయడం కంటే ముందుగా పూర్తి స్థాయి విచారణ ద్వారా నిజానిజాలు వెలుగులోకి రావాలని ఆయన కోరారు. తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిన ఆ విద్యార్థుల కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానవతా దృక్పథంతో ఆదుకోవాలని, తగిన ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా గిరిజన సంక్షేమ హాస్టళ్లలో భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని, విద్యార్థుల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాలు, ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు.

## సారవకోట ప్రత్యేక అధికారిగా లోకనాథం బాధ్యతల స్వీకరణ



**సారవకోట, సెప్టెంబరు 24 (వార్త):** సారవకోట మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా ఎం. లోకనాథం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మండల పరిషత్ పరిధిలోని పరిపాలనా వ్యవహారాలపై సమీక్షించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మండలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేసేందుకు ప్రాధాన్యం ఇస్తామని లోకనాథం తెలిపారు. ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేస్తానని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల పరిషత్ అధికారులు, సిబ్బంది సహకారంతో పరిపాలనను సమర్థవంతంగా కొనసాగిస్తూ ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు చేరేలా కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

## పర్లాం-మాకివలస రహదారి గుంతలమయం



**జలుమూరు, సెప్టెంబరు 24 (వార్త):** పర్లాం గ్రామం నుంచి మాకివలసకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై పలుచోట్ల పెద్ద గుంతలు ఏర్పడటంతో రాకపోకలు ప్రమాదకరంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి మొత్తం గుంతలు ఏర్పడటంతో వాహనాలు నడపడం ఇబ్బందిగా మారిందని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాల్సి వస్తోందని, విద్యార్థులు, వృద్ధులు రాకపోకల్లో అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాల సమయంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో రహదారిపై ఎక్కడ గుంత ఉందో గుర్తించడం కూడా కష్టంగా మారుతోందని స్థానికులు తెలిపారు. దీంతో ప్రయాణికులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలకు రహదారి పరిస్థితి తీవ్ర సమస్యగా మారిందని పేర్కొన్నారు. పర్లాం-మాకివలస రహదారి పరిస్థితిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి తక్షణమే గుంతలను పూడ్చడంతో పాటు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. తాత్కాలిక చర్యలతో సమస్యను వాయిదా వేయకుండా రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలి

**- సుమారు 30 ఎకరాల్లో పంటలు నీటిముంపు**




**సరుబుజ్జిలి, సెప్టెంబరు 24 (వార్త):** సరుబుజ్జిలి మండల వ్యాప్తంగా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు సుమారు 30 ఎకరాల వ్యవసాయ భూముల్లోకి నీరు చేరి పొలాలు ముంపునకు గురయ్యాయని మండల బిజెపి మహిళా అధ్యక్షు రాలు బాడాన యమున అన్నారు. భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడిందని ఈ మేరకు గురువారం నాడు తుఫాను ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. రోజుల తరబడి పొలాల్లో నీరు నిలిచిపోవడంతో పంటలు పూర్తిగా దెబ్బతిని, భూములు పాడయ్యే పరిస్థితి ఏర్పడిందని పంటల సాగు కోసం రైతులు పెట్టిన పెట్టుబడులు నీటిపాలవడంతో తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సంబం ధిత అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బందితో పంట నష్టం సర్వే నిర్వ హించాలని, ముంపునకు గురైన ప్రతి ఎకరాను గుర్తించి నష్టపోయిన రైతులకు తగిన పంట నష్టపరిహారం అందించాలని మండలం బిజెపి మహిళా అధ్యక్షురాలు బాడాన యమున డిమాండ్ చేశారు. పొలాల్లో నిలిచిన నీటిని త్వరితగతిన బయటకు పంపేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి ముంపు సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత డ్రైనేజీ, నీటి పారుదల సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar, printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546